సాక్షి
గుంటూరు

శుక్రవారం, 24, మే, 2024



లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

నకరికల్లు: స్థానిక ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం గురువారం కనులపండువగా నిర్వహించారు.



ఈశ్వరుడికి విశేష పూజలు

తెనాలిరూరల్: తెనాలి సుల్తానాబాద్‌లోని గంగా కాశీ అన్నపూర్ణేశ్వరి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థాన వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దేశమ్మ తిరునాళ్ల



గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామ దేవత దేశమ్మతల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారికి పసుపు, కుంకుమలు, చద్ది నైవేద్యాలు సమర్పించుకున్నారు.

న్యూస్‌రీల్

నృసింహస్వామిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని లక్ష్మీ నృసింహస్వామిని గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి సీటీ రవికుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయక కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, స్థానిక అధికారులు ఘనస్వాగతం పలికారు. న్యాయమూర్తి రవికుమార్ దంపతులు పానకాల స్వామిని దర్శించుకుని పానకాన్ని నైవేద్యంగా సమర్పించి, అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు పానకాల స్వామి క్షేత్ర మహత్యాన్ని న్యాయమూర్తికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి, మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులు, ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గుంటూరు మెడికల్: జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, దంత వైద్యశాలలు, లేబరేటరీలు, స్కానింగ్ సెంటర్లు, సరోగసీ సెంటర్లు, సంతాన సాఫల్య కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా సెంటర్లు నిర్ణీత సమయంలో రిజిస్టర్, రెన్యూవల్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అలా చేయించుకోని పక్షంలో అల్లోపతి, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక, సరోగసీ, ఏఆర్టీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చట్ట ఉల్లంఘన తీవ్రతను బట్టి ఆయా సెంటర్లను సీజ్ చేయటం జరుగుతుందన్నారు.

రేపు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పరీక్ష

గుంటూరు వెస్ట్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పరీక్ష ఆదివారం ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 1975 మంది హాజరుకానున్న ఈ పరీక్ష కోసం 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఉదయం 8:15 లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. హాల్ టికెట్‌తోపాటు ప్రభుత్వం మంజూరు చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపాలి. మొబైల్స్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించరు.

యువకుడిపై సీసాలు, ఇనుప రాడ్‌లతో దాడి



అత్తోట(కొల్లిపర): మండలంలోని అత్తోట గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో యువకుడిపై ఒక మైనర్, మరో ఇద్దరు వ్యక్తులు సీసాలు, ఇనుప రాడ్‌లతో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. దీనిపై బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం.. అత్తోట గ్రామానికి చెందిన అయినాల మోహన్‌కృష్ణ అర్ధరాత్రి సమయంలో మూత్ర విసర్జనకు బయటకు వచ్చిన క్రమంలో అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు, బాలుడి తండ్రి, బొల్లిముంత చెంతన కుమార్‌లు ఒక్కసారిగా బీరు సీసాలు, ఇనుప రాడ్‌లతో దాడి చేశారు. ఘటనలో మోహన్‌కృష్ణ తలకు బలమైన గాయమైంది. వెంటనే తేరుకున్న బాధితుడు తన ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకొన్నాడు. బాధితుడిని అతని స్నేహితులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గురుకుల పాఠశాలల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 2024-25 సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 5వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీట్లలో ప్రవేశాలకై అర్హత గల విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె.పద్మజ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 5వ తరగతి ప్రవేశానికై ఈ నెల 28వ తేదీన బాలురకు, 29న బాలికలకు.. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశానికై 30న బాలురు, 31న బాలికలకు అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- ప్రతి రౌండ్ లెక్కింపునకు 14 టేబుళ్లు
- తొలిఫలితం తాడికొండ
- తుది ఫలితం మంగళగిరి...
- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు, 8:30 నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు
- ఏఎన్‌యూ వద్ద మూడంచెల పటిష్ట బందోబస్తు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద డ్రోన్‌లు ఎగరవేయడం నిషిద్ధం
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. గురువారం పార్లమెంట్, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. కౌంటింగ్ జరిగే ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులతో మూడు అంచెల్లో భద్రత ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు బ్లాకులలో ఈవీఎంలు భద్రపరిచారు. సెంట్రల్‌హాల్‌లో పార్లమెంట్ ఈవీఎంలు భద్రపరిచారు.

- అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం పార్లమెంట్ పరిధిలో 14,12,003 ఓట్లు పోలవ్వగా, మంగళగిరిలో అత్యధికంగా 2,50,742 ఓట్లు, తూర్పు నియోజకవర్గంలో 1,76,652 ఓట్లు పోల్ అయ్యాయి.
- తాడికొండ ఓట్ల లెక్కింపు 18 రౌండ్లలో, పొన్నూరు, తూర్పు నియోజకవర్గాలు 19 రౌండ్లు, తెనాలి 20 రౌండ్లు, ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ 21 రౌండ్లు, మంగళగిరి 22 రౌండ్లలో లెక్కింపు పూర్తి అవుతుంది.
- తాడికొండలో 18 రౌండ్లతో పాటు అభ్యర్థుల సంఖ్య పది మాత్రమే ఉండటంతో తొలిఫలితం వెలువడే అవకాశం ఉంది.
- మంగళగిరిలో 22 రౌండ్ల లెక్కింపుతో పాటు 40 మంది అభ్యర్థులు ఉండటంతో ఫలితం అన్నింటికంటే చివరిలో వచ్చే అవకాశం ఉంటుంది.
- పోస్టల్ బ్యాలెట్లు 23,600 వరకూ వచ్చాయి. ఇంకా సర్వీస్ ఓట్లు వస్తూనే ఉన్నాయి. 1700 సర్వీస్ ఓటర్లకు గాను ఇప్పటి వరకూ 300 ఓట్లు మాత్రమే చేరాయి.
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు పార్లమెంట్‌కు మరో 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు.
- ఒక్కో రౌండుకు 500 ఓట్లు లెక్కిస్తారు. అంటే తొలిరౌండ్ అయ్యేసరికి ఏడువేల పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు.



- నాలుగు రౌండ్లలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఉంటుంది. పార్లమెంట్‌కు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతోపాటే ఈవీఎంల లెక్కింపు కూడా మొదలవుతుంది.
- అసెంబ్లీల విషయానికి వస్తే తాడికొండ, తెనాలి, ప్రత్తిపాడు, తూర్పు నియోజకవర్గాలకు నాలుగు టేబుళ్లు, పశ్చిమ ఐదు టేబుళ్లు, మంగళగిరి, పొన్నూరు మూడు టేబుళ్లలో లెక్కింపు జరుగుతుంది.
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు 8 గంటలకు ప్రారంభం కానుండగా, ఈవీఎంల లెక్కింపు 8.30 గంటలకు ప్రారంభం అవుతుంది.
- తొలిరౌండు 30 నిముషాలు పడుతుందని, మిగిలిన రౌండ్లు ఒక్కోటి 20 నిముషాల్లో పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.
- కౌంటింగ్ జరిగే చోట విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఈ నెల 25, 26 తేదీలలో మొదటి విడత శిక్షణ, జూన్ మూడున రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.
- ఎన్నికల పరిశీలకులు సంతకం చేసిన తర్వాతే రౌండ్‌ల వారీగా ఫలితాలు వెల్లడిస్తారు.
- ఇప్పటికే కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.
- జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో బాటిల్స్‌లో పెట్రోల్ పోయడం నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- కౌంటింగ్ కేంద్రాల వద్ద డ్రోన్లు ఎగురవేయడాన్ని నిషేధించారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ పరిశీలన..

గుంటూరు వెస్ట్: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జరగనున్న ఓట్ల లెక్కింపుపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్‌తో సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు, ఓట్ల లెక్కింపునకు ఎంపికయ్యే సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలని సూచించారు.

- ఈవీఎంలు భద్రపరిచిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.
- రాజకీయ పార్టీల అభ్యర్థులు/కార్యకర్తలు బాణసంచా కాల్చడానికి అనుమతి లేనందున, గుంటూరు జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రాలను, నిల్వచేసే గోడౌన్‌లలో పోలీసు, ఫైర్ అధికారులు ఇప్పటికే తనిఖీలు చేపట్టారు.
- ఎన్నికల కోడ్ ముగిసే వరకు బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు, నిల్వచేసే గోడౌన్‌ల యజమానులు బాణసంచా విక్రయించరాదని ఆదేశాలు జారీ చేశారు.

కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి జరగనున్న ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కౌంటింగ్ కోసం నాలుగు బ్లాక్‌లు సిద్ధం చేశామన్నారు. గుంటూరు పార్లమెంట్‌తో సహా 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు, ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇంటర్నెట్‌లో ఇబ్బందులు ఏర్పడకుండా ప్రత్యేక లైను ఏర్పాటు చేస్తున్నామని, ఆ పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయన్నారు. కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ప్రదేశంలో మీడియా సెంటర్ ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. గుంటూరు పార్లమెంట్ బరిలో 30 మంది అభ్యర్థులున్నారని, జూన్ 4న సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యలో కౌంటింగ్ పూర్తయ్యే అవకాశముందన్నారు. వీవీ ప్యాట్‌ల ఓట్లు లెక్కింపు సాయంత్రం 6 గంటలలోపు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. మంగళగిరి అసెంబ్లీ బరిలో 40 మంది పోటీలో ఉన్నారని, ఓట్ల లెక్కింపు 22 రౌండ్లు ఉన్నందును రాత్రి 8 గంటల వరకు కౌంటింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఉద్యోగులకు తొలి దశ శిక్షణనిస్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో పెద్ది రోజా, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారి శైలజ, అధికారులు పాల్గొన్నారు.

బీసీజీ టీబీ టీకాకు విశేష స్పందన

- 3,24,964 మందికి టీకాలు
- రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తాళ్లూరి రమేష్



మహిళకు బీసీజీ టీబీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: 18 ఏళ్లు పైబడిన వారికి ఆరు కేటగిరీల్లో 12 జిల్లాల్లో కొనసాగుతున్న బీసీజీ టీబీ టీకాకు విశేష స్పందన లభించిందని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తాళ్లూరి రమేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,24,964 మందికి ఈ టీకాలు వేశామన్నారు. గురువారం ఆయన గుంటూరులోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధిలో గోరంట్ల, మల్లికార్జున పేట, నాజ్ సెంటర్, గుంటూరువారితోట, ఓల్డ్ గుంటూరు, ఐపీడీ కాలనీ, లాంచెస్టర్ రోడ్, శ్రీనివాసరావు తోట తదితర ప్రాంతాల్లో బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వెనుకబడి ఉందని, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది మరింత అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రతి గురువారం రోజు ఈ టీకాను వేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ఆయా జిల్లాలకు నియమితులైన నోడల్ ఆఫీసర్లు టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారన్నారు. 12 జిల్లాల్లో బీసీజీ టీబీ టీకాను ఈనెల 16న ప్రారంభించామని, ఆ రోజు 1,71,507 మందికి బీసీజీ టీబీ టీకాను వేశామన్నారు. విజయనగరం, వైఎస్సార్ కడప, చిత్తూరు, ఎస్.ఎస్.పి.నెల్లూరు, సత్యసాయి, కృష్ణా, నంద్యాల, పల్నాడు, విశాఖపట్నం, అన్నమయ్య, గుంటూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఇప్పటి వరకు ఈ టీకాలు వేశామని డాక్టర్ రమేష్ తెలిపారు.

తల్లిదండ్రుల చేతికి ప్రగతి పత్రం



గుంటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు (ఫైల్)


- విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను నేరుగా తల్లిదండ్రులకు పంపుతున్న పాఠశాల విద్యాశాఖ
- పేరెంట్స్ సెల్‌ఫోన్‌కు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం
- ఎస్ఎంఎస్‌తో పాటు స్కూల్ ఇన్ఫర్మేషన్ సిస్టం సైట్ లింక్ చేరవేత
- ఓటీపీ ఆధారిత సురక్షితమైన పద్ధతిలో సమాచారం బట్వాడా

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతికి సంబంధించిన పత్రాలను పాఠశాల విద్యాశాఖ నేరుగా తల్లిదండ్రులకు చేరవేస్తోంది. గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వారీగా 2024-24 విద్యా సంవత్సరానికి నమోదైన హాజరు, పరీక్షల్లో వచ్చిన మార్కుల వివరాలతో తల్లిదండ్రుల రిజిస్టర్డ్ సెల్‌ఫోన్ నంబర్లకు సంక్షిప్త సమాచారం (ఎస్ఎంఎస్) రూపంలో సమాచారాన్ని చేరవేస్తున్నారు. గత ఏప్రిల్ నెలలో వేసవి సెలవులు ఇచ్చిన రోజునే తల్లిదండ్రులను పాఠశాలలకు పిలిచి, విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల్లో భాగంగా పారదర్శక విధానంలో పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు పంపించే విధానాన్ని అమల్లోకి తెచ్చిన విద్యాశాఖ దీనిని విజయవంతంగా అమలు పరుస్తోంది.

పూర్తి వివరాలతో...

గత విద్యాసంవత్సరంలో ఆయా యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతివరకు చదివిన విద్యార్థుల ఇంటిపేరుతో సహా పూర్తిపేరు, తల్లిదండ్రుల పేర్లు, అడ్మిషన్ నంబరు, మొదటిసారిగా పాఠశాలలో చేరిన సంవత్సరం, పుట్టినతేదీ, ఊరు, పిన్‌కోడ్ వివరాలతో పాటు ఆధార్‌కార్డులోని చివరి నాలుగు అంకెలు, ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సమ్మెటివ్ అసెస్‌మెంట్‌ల వారీగా పొందిన మార్కులు, గతేడాది జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమైనది మొదలు ఏప్రిల్‌లో చివరి పనిదినం వరకు పాఠశాలల జరిగిన రోజులు, విద్యార్థి హాజరైన రోజులను పొందుపర్చారు. ఇదే కాలమ్‌లో మొత్తం హాజరు 100 శాతానికి గాను విద్యార్థి హాజరైన శాతాన్ని పొందుపర్చారు.

ప్రోగ్రెస్ కార్డు పొందడం ఇలా..



రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలోని స్కూల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా విద్యార్థుల తల్లి/తండ్రి సెల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్‌లు వెళ్లాయి. ఎస్ఎంఎస్‌లో ఫలానా తరగతి చదువుతున్న మీ అబ్బాయి, అమ్మాయి ప్రగతికి సంబంధించి 'హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్'కు సంబంధించిన వివరాలను ఈ లింక్‌లో పొందుపర్చామని, దీనిపై క్లిక్ చేయడం ద్వారా ప్రగతి పత్రాన్ని చూడగలరని ఇంగ్లిష్‌లో పంపిన మెసేజ్ సారాంశంగా ఉంది. లింక్ పై క్లిక్ చేసిన తరువాత స్క్రీన్‌పై కనిపించే అక్షరాలను అక్కడ ఇచ్చిన స్పేస్‌లో టైపు చేయగానే పాఠశాలలో ఇచ్చిన రిజిస్టర్డ్ మొబైల్ నంబరుకు ఆరు అంకెల ఓటీపీ వస్తుంది. ఓటీపీని ఎంటర్ చేసిన తరువాత హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్ ప్రత్యక్షమవుతుంది. దీనిని పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవడం ద్వారా విద్యార్థి ప్రగతికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించుకోవచ్చు.

వాహన్ పోర్టల్‌ను వినియోగించుకోవాలి

పట్నంబజారు: ప్రతి ఒక్క వాహన చోదకుడు వారి వాహనాలకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు వాహన్ పోర్టల్ ద్వారా పొందాలని డీటీసీ షేక్ కరీమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా పరిధిలోని వాహన కార్యకలాపాలైన వాహన బదిలీలు, చిరునామా మార్పు, ఎఫ్‌సీలు, పర్మిట్‌లు, ఎన్‌ఓసీల, ట్యాక్స్ చెల్లింపులు, వాహన్ పోర్టల్ ద్వారానే పొందాలన్నారు. ఇప్పటి వరకు ఈ-ప్రగతి సాఫ్ట్‌వేర్ ద్వారా ఆర్టీఏ సేవలు జరుగుతున్నాయని, జాతీయ రహదారి శాఖ ఆధ్వర్యంలో వాహన్, సారథితో అనుసంధానమైన వాహన యజమానులు వాహన్ పోర్టల్ ద్వారా లాగిన్ అయి సేవలను పొందాలని సూచించారు.

అంకమ్మ తల్లి ఆలయానికి మహర్దశ

- గుంటూరు గ్రామ దేవతగా పాతగుంటూరు కొర్లపాటి అంకమ్మ తల్లి ప్రసిద్ధి
- తిక్కన మహాకవి నల్లశానమాంబగా అర్చించిన వైనం
- 200 సంవత్సరాల కిందట పునఃనిర్మాణం
- ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన వైనం
- రూ.1.20 కోట్లతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం



పాతగుంటూరులోని అంకమ్మ తల్లి దేవస్థానం



శిథిలావస్థలో కల్యాణ మండపం

గుంటూరు ఈస్ట్: పాతగుంటూరులోని కొర్లపాటి అంకమ్మతల్లి దేవస్థానానికి మహర్దశ పట్టనుంది. ప్రస్తుతం ఉన్న ఆలయం స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. తిక్కన మహాకవి అంకమ్మతల్లిని నల్లశానమాంబగా కొలిచారని ప్రతీతి. గ్రామ దేవతలందరికీ అక్కగా వెలుగొందుతున్న అంకమ్మతల్లి గర్తపురి వాసుల గ్రామ దేవతగా పూజలందుకుంది. అనంతర కాలంలో ఆలయం శిథిలమైంది. 200 సంవత్సరాల కిందట శనక్కాయల వంశీయులు చిన్న ఆలయాన్ని ప్రస్తుతం ఉన్నచోట పునర్నిర్మించారు. ఆలయం వెనుక చిన్న కల్యాణ మండపాన్ని నిర్మించి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. అయితే నేడు ఆలయం, కల్యాణ మండపాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఈ స్థితిపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అధికారులు స్పందించి నూతన ఆలయ నిర్మాణానికి కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి పొందారు.

భక్తుల కొంగు బంగారం..

అంకమ్మతల్లి పిలిస్తే పలికే దైవంగా భక్తుల నమ్మకం. సమస్యల్లో ఉన్నవారు అమ్మవారిని మొక్కుకుని ఆ సమస్య పరిష్కారం అనంతరం కృతజ్ఞతలతో అమ్మవారి మొక్కులు చెల్లించుకుంటుంటారు. శుక్ర, ఆదివారాల్లో భక్తులు ఎక్కువగా తరలి వస్తుంటారు. ముఖ్యంగా శివరాత్రిరోజు ప్రత్యేక ఉత్సవం నిర్వహిస్తారు. అన్ని పర్వదినాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వస్తుంటారు. ఎప్పుడు ఆలయం పడిపోతుందోనని భక్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో నూతన ఆలయ నిర్మాణం భక్తుల మనసుల్లో ఆనందాన్ని నింపుతోంది.

భవ్యమైన ఆలయ నిర్మాణానికి చర్యలు..

భవ్యమైన ఆలయ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. అమ్మవారి ఆలయం మిగులు నిధుల నుంచి మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.40 లక్షలు కేటాయించారు. ప్రభుత్వం నుంచి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. మొత్తం రూ.1.20 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ఆలయం ఈ ప్రభుత్వం హయాంలో నూతన హంగులతో రూపుదిద్దుకోనుంది. గర్భగుడి రాతినిర్మాణంతో సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కల్యాణ వేదిక నిర్మాణం చేసి భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తేనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా భక్తులు ఆలయ పునఃనిర్మాణం కోసం కంటున్న కలలు త్వరలో నెరవేరనున్నాయి.


పూర్వ వైభవం తెస్తాం..



ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న అంకమ్మ తల్లి ఆలయాన్ని పునఃనిర్మించడం సంతోషకరంగా ఉంది. భక్తులకు మంచి శుభవార్త. ఆలయాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దడానికి భక్తులు తమవంతు సహాయ సహకారాలు అందించాలి. ఆలయానికి పూర్వ వైభవం తెస్తాం.

– బొంతు మహేశ్వరరెడ్డి, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్

ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలి



ముఖేష్‌కుమార్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న ఫోరం సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: జూన్ 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు విజ్ఞప్తి చేసినట్లు గుంటూరుకు చెందిన అవర్ స్టేట్, అవర్ లీడర్ – వైఎస్సార్ ఇంటిలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి తెలిపారు. ఈమేరకు గురువారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖేష్‌కుమార్ మీనాను కలిసిన ఫోరం సభ్యులు ప్రవీణ్, లక్ష్మీనారాయణరెడ్డి వినతి పత్రం సమర్పించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చెలరేగిన హింసను దృష్టిలో ఉంచుకుని, కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

కౌంటింగ్ ప్రక్రియపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

తాడేపల్లి రూరల్: జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా జేసీ, మంగళగిరి నియోజకవర్గ ఆర్ఓ రాజకుమారి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజంట్లకు కౌంటింగ్ ప్రక్రియపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సివిల్ మరియు మెకానికల్ బ్లాక్, రూమ్ నెం. 206, మొదటి అంతస్తులో కౌంటింగ్ జరుగుతుందని, కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉదయం 6.30 గంటలకు కౌంటింగ్ హాల్‌కు చేరుకోవాలని వివరించారు. మొబైల్ ఫోన్లు లోపలకు అనుమతించరని, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజంట్లు ఎన్నికల సిబ్బందికి సహకరించాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్లను కౌంటింగ్‌కు ఒక రోజు ముందు జూన్ 3వ తేదీ సాయంత్రం అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్ల సమక్షంలో ఏఎస్‌యూలో భద్రపరచడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ హాల్‌లో ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 3 టేబుల్స్, ఈటీపీబీఎస్ లెక్కింపునకు ఒక టేబుల్‌ను ఏర్పాటు చేశామని టేబుళ్ల వారీగా కౌంటింగ్ ఏజంట్లను నియమించుకోవాలని ఆమె తెలిపారు.

నూజివీడు సీడ్స్ సుబాజ్ కిసాన్ సమావేశం



రైతులతో నూజివీడు సీడ్స్ యాజమాన్యం

గుంటూరు రూరల్: నూజివీడు సీడ్స్ సుబాజ్ కిసాన్ సమావేశాన్ని ఏటుకూరు రోడ్డులోని కృష్ణసాయి ఎంటర్‌ప్రైజెస్ గోదాములో నిర్వహించారు. గురువారం నిర్వహించిన సమావేశంలో నూజివీడు సీడ్స్ కన్సల్‌టెంట్ డాక్టర్ బి.రోశయ్య మాట్లాడుతూ నూజివీడు సీడ్స్ సంస్థ స్థాపించి 50 సంవత్సరాల కాలంలో రైతులకు మేలైన వంగడాలను అందించటంతోపాటు రైతుల అవసరాలకు తగినరీతిలో పత్తిలో మేలైన విత్తనాలు అందించటం జరిగిందన్నారు. కె.తల్పసాయి మాట్లాడుతూ అధిక మొక్కల సాంద్రతతో అధిక దిగుబడిని పొందేందుకు నూజివీడు సీడ్స్ పత్తి రకాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు నూజివీడు సీడ్స్ యాజమాన్యం, 20 గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

తెనాలిరూరల్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన తెనాలి రైల్వేస్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సుమారు 65 ఏళ్ల వయసున్న వృద్ధుడు 3వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి పట్టాలు దిగి నాలుగో నంబరు ప్లాట్‌ఫాం ఎక్కే క్రమంలో రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఇటుకపాడి రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతగుంటూరులో భారీ అగ్ని ప్రమాదం



పట్నంబజారు: పాతగుంటూరు, సుద్దపల్లిడొంక శివారు ప్రాంతమైన ప్రగతి నగర్ సమీపంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి సంబంధించి ప్లాస్టిక్ పైపులు నిల్వ ఉంచిన ఓ కంపెనీలో గురువారం మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగాయి. సుమారు రూ. 2 కోట్ల విలువ చేసే ప్లాస్టిక్ పైపులు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రమాదకారణం తెలియరాలేదు. అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా నల్లటి పొగ కమ్మేసింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సుమారుగా 40 లాట్‌లు వరకు పైపులు తగలబడినట్లు అధికారులు తెలిపారు. షాపుంజీ పల్లోంజీ కంపెనీకి సంబంధించిన కాంట్రాక్టు పనులకు చెందిన పైపులు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు.

మోదుగుల ఆదిలక్ష్మికి ఘన నివాళులు



మోదుగుల ఆదిలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, మోదుగుల కుటుంబసభ్యులు



నివాళులర్పిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, రెడ్డి ల్యాబ్స్ అధినేత కళ్లం సతీష్‌రెడ్డి

గుంటూరు రూరల్: మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాతృమూర్తి ఆదిలక్ష్మి ఇటీవల మృతిచెందిన సంగతి తెలిసిందే. గురువారం గోరంట్ల రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని మోదుగుల నివాసంలో అశ్రుత నివాళి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నామా నాగేశ్వరరావు, మోపిదేవి వెంకటరమణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, రెడ్డి ల్యాబ్స్ అధినేత కళ్లం సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తిని శివకుమార్, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, నగర డిప్యూటీ మేయర్ వజ్రబాబు, వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా, అన్నాబత్తుని సదాశివ, పోతుల మహేష్, మోదుగుల కుటుంబ సభ్యులు, నగరంలోని ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆదిలక్ష్మి చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

బాలుడికి కృత్రిమ చేతులు అమరిక



తాడేపల్లిరూరల్: మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళకరం-2024 జెమ్ ఎం కె1 హ్యాండ్స్ కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ శిబిరాన్ని గురువారం మంగళగిరిలోని వీటీజే ఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు అందె రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం, నారాయణపేటకు చెందిన దివ్యాంగుడు ఎస్.నరేందర్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయిన తరువాత 2022 జూలై 10న తన తల్లి అంజమ్మతో కలసి పొలం పనులకు వెళ్లాడని, గుడిసె పైకప్పు సరిచేద్దామని పైకి ఎక్కి తక్కువ ఎత్తులో వున్న 11 కేవీ హైటెన్షన్ విద్యుత్‌వైర్‌ను తాకాడు. దీంతో విద్యుదఘాతానికి గురై రెండు చేతులను కోల్పోయాడు. కృత్రిమ చేతులు అమరుస్తున్న విషయాన్ని తెలుసుకుని ఇక్కడకు వచ్చారని, జపాన్‌కు చెందిన క్రిస్‌గల్ బృందం నరేందర్‌కు కృత్రిమ చేతు లు అమర్చారని తెలిపారు. మంగళగిరి రోటరీ క్లబ్ ప్రోగ్రామ్ చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, సెక్రటరీ గాజుల శ్రీనివాసరావు, ఫైనాన్షియల్ చైర్మన్ పారేపల్లి నిరంజన్ గుప్త, ప్రాజెక్ట్ చైర్మన్ అందే మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

భార్యను కొట్టి చంపిన భర్త



ఆశాభాయి మృతదేహం

గుంటూరు రూరల్: విలాసాలకు, మత్తు పదార్థాలకు అలవాటుపడిన ఓ వ్యక్తి తనకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యను కొట్టి హత్య చేసిన ఘటన నగరంలోని స్వర్ణభారతి నగర్‌లోని ఐద్వానగర్‌లో జరిగింది. నిందితుడిని నల్లపాడు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐద్వానగర్‌కు చెందిన జాతావత్ అశోక్‌నాయక్‌కు, స్థానికంగా ఉండే ఆశాభాయి(25)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో అశోక్‌నాయక్ పలుమార్లు ఆశాభాయిపై దాడిచేసి డబ్బులు కావాలని హింసించేవాడు. తాగుడు, వ్యసనాలకు బానిసై భార్యను చిత్రహింసలకు గురిచేసేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఆశాభాయిను డబ్బులు కావాలని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఆవేశంతో అశోక్ ఆశాభాయిని తీవ్రంగా కొట్టాడు. తీవ్రగాయాలతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు, బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించి కోర్టుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.